క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ విద్యపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ దాలినాయుడు

నరసన్నపేట: ఓపెన్ స్కూల్ విద్యా విధానంలో టెన్త్, ఇంటర్ పూర్తి చేయవచ్చని, దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంఈఓ పేడాడ దాలినాయుడు అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాభ్యాసాన్ని మధ్యలో ఆపివేసిన వారు, బడిబయట పిల్లలు, వయసు మీరిన ఇతరులు ఎవరైనా ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ పూర్తి చేయవచ్చన్నారు. 2024 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండినవారు టెన్త్‌కు, 15 సంవత్సరాలు నిండినవారు ఇంటర్‌కు అర్హులన్నారు. ఇటువంటి వారికి అనుకూలమైన సమయాల్లోనే తరగతులు ఉంటాయని, పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు.

దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు

నరసన్నపేట: మండలంలోని కరగాం పంచాయతీ అడవినారాయణవలస ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు శిమ్మ లక్ష్మణరావు దంపతులు యూనిఫాం (వైట్ డ్రస్)ను వితరణ చేశారు. స్కూల్లో ఉన్న 25 మంది విద్యార్థులకు ఈ డ్రస్‌లను బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు చేశారు. ఉపాధ్యాయుడు సుధీర్ పాల్గొన్నారు.

గుత్తావల్లి పీహెచ్‌సీకి రూ.50 లక్షల మంజూరు

బూర్జ: మండలంలోని గుత్తావల్లి పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరైనట్లు ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ నిధులతో ల్యాబరేటరీ, హెచ్‌ఎంఐఎస్ యూనిట్ నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నదీ తీర ప్రాంతాల పరిశీలన



అల్లెన సమీపంలోని నాగావళి నదిని పరిశీలిస్తున్న అధికారులు

బూర్జ: మండలంలోని నాగావళి నదీ సమీపంలోని జీ.బీ.పురం, అల్లెన తదితర గ్రామాల్లో కరకట్టలు లేక ప్రజలు బిక్కు, బిక్కుమంటూ జీవిస్తున్నారు. ఈ సమస్యపై ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వంశధార అధికారులు బుధవారం నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ ఎ.రమేష్, జంపరకోట సబ్ డివిజన్ ఏఈఈ జి.కార్తిక్, ఏఈఈ కె.యశ్వంత్ పాల్గొన్నారు.

కేజీబీవీ అభివృద్ధికి నిధుల మంజూరు



నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రూ.93.94 లక్షలు మంజూరయ్యాయని ఐటీడీఏ జేఈ ప్రసాద్ బుధవారం తెలిపారు. 8 అదనపు తరగతి గదులు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గతేడాది కేజీబీవీలో ఇంటర్ కూడా నిర్వహించడంతో అదనపు తరగతి గదులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇటీవల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస: తమ సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డేపల్లి మోహన్‌రావు, బి.జనార్దనరావు కోరారు. పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ అధికారి చంద్రశేఖర్‌ను బుధవారం కలిసి పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను వివరించారు. డెత్ క్లెయిమ్‌లు వేగవంతం చేయాలని, పే స్లిప్‌లలో పొరపాట్లను సరిచేయాలని కోరారు. సంఘం కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన దేశభక్తి

నరసన్నపేట: క్రికెట్ సబ్‌సెంటర్ వద్ద విద్యార్థులు బుధవారం జాతీయ జెండాను రెపరెపలాడించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మూడు రంగుల జెండాలను ప్రదర్శించి జాతీయ సమైఖ్యతను చాటిచెప్పారు. మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దీపాలంకరణ..

విశ్వహిందూ పరిషత్ నరసన్నపేట ప్రఖండ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరాలయం వద్ద దేశ చిత్రం చుట్టూ మహిళలు దీపాలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్‌కు చెందిన ప్రతినిధులు కరుణశ్రీ, సుదాకర్, సంతోషి, వారణాశి నగేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. అఖండ భారత్ సంకల్ప దివాస్ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మూడు రంగుల దీపాలతో అలంకరించారు. సర్పంచ్ బూరలి శంకర్, ఉప సర్పంచ్ ఎస్. కృష్ణబాబులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండల సమాఖ్య కార్యాలయం వద్ద హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, మహిళలతో కలిసి వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ కూర్మారావు బుధవారం జాతీయ జెండాలను ఎగరవేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ఆమదాలవలస పట్టణంలో బీజేపీ నాయకులు ర్యాలీ చేపట్టారు.



నరసన్నపేట: దేశ చిత్ర పటం చుట్టూ దీపాలంకరణ

ఆకట్టుకున్న రంగవల్లిక

సారవకోట: స్వతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని జేబీటీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు దేశ చిత్రపటాన్ని వేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయాలని పాఠశాల డైరెక్టర్ మోహన్‌గాంధీ విద్యార్థులకు సూచించారు.



నరసన్నపేట: మూడు రంగుల దీపాలతో కళకళలాడుతున్న పంచాయతీ కార్యాలయం



నరసన్నపేట: క్రికెట్ సబ్ సెంటర్ వద్ద జాతీయ జెండా రెపరెపలు



ఆమదాలవలస: ర్యాలీలో పాల్గొన్న ఏపీడీ కూర్మారావు, విద్యార్థులు



సారవకోట: దేశ చిత్రపటాన్ని వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భయం.. భయం..

హిరమండలం: మండలంలోని మహలక్ష్మీపురం వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువపై వంతెన దుస్థితి ఇది. కాలువ ప్రారంభంలోనే ఈ గ్రామం ఉంది. నీరు విడిచిపెట్టినప్పుడు ప్రవాహం ఇక్కడ అధికంగా ఉంటుంది. కాలువపై వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ ధ్వంసమైంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. మహలక్ష్మీపురం కాలనీ, పిండ్రువాడ కాలనీ, కోదూరు, సీది, సత్యజగన్నాథపురం గ్రామాల ప్రజలు సారువకోట మండలం బొంతు జంక్షన్‌కు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ ఉత్పత్తులను నాటు బళ్లపై తరలిస్తుంటారు. వాహన రాకపోకలు కూడా అధికంగా ఉంటాయి. రక్షణ గోడ ధ్వంసం కావడంతో ఆందోళన చెందుతున్నారు. హెచ్చరికగా అక్కడ ఎర్రటి వస్త్రాన్ని కట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రక్షణ గోడను నిర్మించాలని కోరుతున్నారు.



పాడైన రక్షణ గోడ

సమన్వయంతో పని చేయాలి

మెళియాపుట్టి: మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించే బృందం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశానికి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పరిస్థితుల దృష్ట్యా కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. చిన్న పొరపాట్లను పెద్దవి చేసి పారదర్శకతకు హాని కలిగించొద్దన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉంటే కచ్చితంగా గుర్తించాలన్నారు. ఎస్‌ఆర్పీ రామారావు అధ్వర్యంలోని 10 మంది తనిఖీ బృందం సభ్యులు సుమారు 15 రోజులపాటు గ్రామాల్లో ఇదివరకు చేపట్టిన ఉపాధి పనులు, సామాజిక భద్రత పింఛన్లు, భవన నిర్మాణాల నాణ్యతను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఏపీడీ శైలజ, ఎంపీడీఓ భాస్కరరావు, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, అధికారులు, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు

ప్రసవాల సంఖ్య పెంచండి

సారవకోట: స్థానిక పీహెచ్‌సీని అడిషనల్ డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్ బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో ప్రసవాలను పెంచాలని వైద్యురాలు సౌమ్య, వైద్య సిబ్బందిని సూచించారు. వైద్య సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, ప్రసవాల గూర్చి తెలుసుకున్నారు. బొంతు పీహెచ్‌సీని సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్, సీహెచ్ఓ పద్మావతి ఉన్నారు.



సారవకోటలో సిబ్బందికి సూచలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ శ్రీకాంత్

రోడ్డుపై గ్రానైట్ వ్యర్థాలు

నరసన్నపేట: నిమ్మాడ, చిన్నబమ్మిడి, పెద్దబమ్మిడి తదితర గ్రామాల్లో అధికంగా ఉన్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థాలను ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. జాతీయ రహదారిపై పడడంతో స్థానికులు, వాహనదారులు మంగళ, బుధవారాల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధూళి రేగి ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడుతుంది. రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వీటిని వేస్తున్నారు. నిమ్మాడ కూడలి నుంచి మడపాం వరకు ఇదే పరిస్థితి. దీనిపై అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గుండవల్లి-కోమర్తి మధ్య రోడ్డుపై పడిన గ్రానైట్ వ్యర్థాలు

సమస్యలు పరిష్కరిస్తాం

కొత్తూరు: మండలంలోని ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో మండల సాధారణ సమావేశాన్ని ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన ఎంపీడీఓ పావని బుధవారం నిర్వహించారు. వంశధార నిర్వాసితుల సమస్యలు, ప్రధాన రహదారుల సమస్యతోపాటు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి సభ్యులు తీసుకువెళ్లారు. నిర్వాసితులను సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో ఎరువులను అధిక ధరలకు విక్రయించడంతో రైతులపై అదనపు భారం పడుతుందని మెట్టూరు బిట్-3 సర్పంచ్ శ్రీనివాసరావు అన్నారు. ఎరువుల సమస్య లేకుండ చూడాలని ఏఓ స్వర్ణలతకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం లేదని వసప సర్పంచ్ ఆపీస్‌రావు సభ దృష్టికి తీసుకువచ్చారు. వెలుగు కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు పలు రకాల రుణాలను ఏపీఎం మంజూరు చేయడం లేదని సభ్యులు ఫిర్యాదు చేశారు. వైస్ ఎంపీపీలు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, మెండ సుమతి, ఈఓపీఆర్డీ, డీటీ సత్యనారాయణ, సీడీపీఓ విమలకుమారి, ఏపీఓ ప్రేమలత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

రూ.15 వేల ఆర్థికసాయం

పొందూరు: మండలంలోని తాడివలస జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు పైడి సుధాకరరావు రూ.15 వేలను హెచ్‌ఎం బల్ల కంటయ్యకు బుధవారం అందజేశారు. మౌలిక వసతుల కల్పనకు ఈ నగదును ఉపయోగించాలన్నారు.

ముద్దాయికి జరిమానా

పొందూరు: స్థల వివాదంలో మండలంలోని ఇల్లయ్యగారిపేట గ్రామానికి చెందిన కొంచాడ అసిరమ్మను కొంచాడ సింహాచలం అనే వ్యక్తి ఇనుప గజంలో కొట్టి గాయపరిచిన కేసులో నేరం రుజువైంది. సింహాచలంకు పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న రూ.5 వేల జరిమానా బుధవారం విధించారు. జరిమానా కట్టకపోతే 6 నెలల జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. 2022 నవంబర్ 2 జరిగిన ఈ వివాదంపై అప్పటి ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఆర్.శాంతి, సంతోషి వాదనలు వినిపించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాసులునాయుడుకి మద్దతు ఇవ్వండి

జలుమూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు ఉపాధ్యాయులు మద్దతుగా నిలవాలని పీఆర్‌టీయూ అధ్యక్షుడు కేశవరావు కోరారు. జలుమూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. వి.హరిచంద్రుడు, మండల శాఖ ప్రతినిధులు దుర్గా ప్రసాద్, ఇప్పిలి వేణుగోపాలరావు, నారాయణరావు, పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



సారిక



భార్గవలక్ష్మి

జలుమూరు: నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి తమ్మయ్యపేట కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని పొట్నూరు సారిక ఎంపికైంది. బుధవారం ఫలితాలు విడుదలైనట్లు ఉపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు. తల్లి రమాదేవి ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తండ్రి కుమారస్వామి వ్యాపారం చేస్తున్నారు. సారికను ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామానికి చెందిన సీపాన భార్గవలక్ష్మి వెన్నెల వలసలోని జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైంది. ఈమె 6వ తరగతిలో చేరేందుకు అర్హత సాధించింది. తాడివలసలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివింది. ప్రస్తుతం అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది.

కళాకారుడు అంపోలు మృతికి సంతాపం



ధర్మారావు (ఫైల్)

ఆమదాలవలస: పట్టణంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన అంపోలు ధర్మారావు(91) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన నాటక రంగంలో అనేక పాత్రల్లో నటించి ప్రజల మన్ననలు పొందారు. వ్యవసాయశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. నాటక రంగంపై ఉన్న మక్కువతో దుర్యోధనుడు, అర్జునుడు వంటి పలు పాత్రల్లో రాణించారు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె కేవీ రాజ్యలక్ష్మి ఆమదాలవలస మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా పని చేశారు. న్యాయవాదిగా స్థిరపడ్డారు. కుమారుడు షణ్ముఖరావు హోమియోపతి డాక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. ధర్మారావు మృతి పట్ల పలువురు కళాకారులు, కుటుంబ సభ్యులు, బంధువులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

జలుమూరు: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని అచ్యుతాపురం, పర్లాం, చల్లవానిపేట, అల్లాడ, తిమడాం, జలుమూరుతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నారు. క్విజ్, మ్యూజికల్ చైర్, కబడ్డీ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు.

వడ్డినవలసలో పొలంబడి

సారవకోట: వరి నాట్లు వేసే సమయంలో వరి ఆకు చివర్లు తుంచి నాట్లు వేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటరావు సూచించారు. బుధవారం మండలంలోని వడ్డినవలస గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి ఆకు చివర్లు తుంచి వేయడం వల్ల ఆ పురుగు నాశనం అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమణ, ప్రకాశ్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జలుమూరు: పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత అని సురవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బాడాన జగన్నాథం, చల్ల సింహాచలం అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థిని సురవరం పల్లవి వితరణ చేసిన మొక్కలు నాటారు. పల్లవిని మిగిలిన విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మేలు

హిరమండలం: ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే సాగు గిట్టుబాటు అవుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య అన్నారు. మండలంలో కిట్టాలపాడులో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నయ్య ఆదివాసీ వికాస్ సంఘం, మన్యదీపిక సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. రైతుకు పంటలపై పూర్తిగా అవగాహన కల్పించేందుకు 14 వారాలపాటు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతులను భాగస్వామ్యం చేయడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు.



కిట్టలపాడులో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడుతున్నాం

సారవకోట: గణిత, కంప్యూటర్ ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడుతున్నామని సారవకోట కేజీబీవీ విద్యార్థినులు పాతపట్నం సివిల్ జడ్జి ఎం.రోషిణి దృష్టికి తీసుకెళ్లారు. సారవకోట కేజీబీవీని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో గదులు సరిపోవడం లేదని జడ్జి దృష్టికి విద్యార్థినులు తీసుకెళ్లారు. స్టాక్ గది, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్నం పెట్టే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.



సారవకోట: స్టాక్ గదిని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రోషిణి

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

పాతపట్నం: స్థానిక ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న కేజీబీవీని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి బుధవారం జడ్జి సందర్శించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు కేజీబీవీని తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గదులు, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించారు. వసతి గృహంలో భోజనాలు ఎలా ఉన్నాయని, ఉపాధ్యాయుల విద్యా బోధన, సమస్యలు, మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏఎన్ఎంకు సూచించారు. ప్రత్యేకాధికారి సంతోషి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

కరకవలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

జలుమూరు: మండలంలోని కరకవలస ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పేడాడ ఈశ్వరరావుపై పూర్తి స్థాయి నివేదిక ఉన్నతాధికారులకు నివేదించనున్నామని ఏపీడీ బి.మురళీకృష్ణ తెలిపారు. పేడాడ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కరకవలసలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టామన్నారు.